


ఆఫీసు గడియారం 'రంగురంగు'మంటూ పది గంటలు కొట్టింది. రోజూలానే ఆఫీసులో కూర్చున్న వారందరి కళ్ళూ, చెవులూ ద్వారంవైపుకి కేంద్రీకరించబడి ఉన్నాయ్ — కలకల నవ్వుతూ ఒకరినొకరు రాచుకుంటూ ప్రవేశించే మాలతీ ప్రసాదుల ఆగమనం కోసం ఎదురుచూస్తూ.

పది గంటలపైన పద్ధెనిమిది సెకన్లు గడిచేక నిశ్శబ్దంగా ఆఫీసులోకి ప్రవేశించేరు ఆ దంపతులు.

ఎదురుచూడని ఆ నిశ్శబ్దాన్ని తిలకించిన ఆఫీసులోని వారంతా మొదట ఆశ్చర్యపోయేరు. తరువాత ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. ఆ పైన ఆలోచనలో పడ్డారు. ఇవన్నీ కూడా ముప్ఫై సెకన్లలో—అంటే ప్రసాదు,

మాలతి గది గుమ్మం దగ్గరనుండి తన సీట్లవద్దకు వెళ్ళేలోగానే జరిగినయ్.

ఇక్కడ ప్రసాదు, మాలతీలను గురించి కొంత చెప్పటం అవసరం. వాళ్ళిద్దరికీ పెళ్ళయి దాదాపు పదినెల్లు కావస్తోంది. ఆ ఆఫీసులో అతను యూడీసీగా, ఆమె టైపిస్టుగా పని చేస్తున్నారు. వాళ్ళిద్దరి సీట్లు కూడా ప్రక్కప్రక్కనే ఉంటయ్. రెండు బల్లలూ ఆనించిపెట్టి కుర్చీలను అటు ఆ బల్లకూ, యిటు యీ బల్లకూ కూడా చెందకుండా మధ్యగా లాక్కొని ఒకరి నొకరు అంటుకునేంత దగ్గరగా కూర్చుంటా రిద్దరూను.

పని సంగతేమో కాని యీ పది నెల్లలోనూ వారికి ఒకరినొకరు చూసు కోవటంతోనే కాలం గడిచిపోతోందను కుంటారు తోటివా రంతాను.

అవసరం వున్నా లేకపోయినా ఒకరినొకరు పలకరించుకోటం గంటల తరబడి ఒకరి కళ్ళలోకి ఒకరు చూసు కుంటూ అర్థంలేకుండా నవ్వటం, ఎవరూ చూడటం లేదనుకుంటే బల్ల కిందుగా చెయ్యీ చెయ్యీ కలుపుకోవటం, కాళ్ల నొక్కుకోవటం లాంటి చిలిపిచేష్టలు చేస్తూండేవాళ్ళు; ఇవే కాక ఇంకా ఇంత కంటె ఘోరమైన పనులుకూడా చేస్తుంటే తాము చూసేమని చెప్తారు కొందరు. ఓ రోజు లంచ్ టైములో అందరూ బయటకు వెళ్ళినప్పుడు ప్రసాద్ మాలతిని ముద్దు పెట్టుకుంటూండగా తాను నాలుగు కళ్ళతోనూ చూసేనని (హ్రస్వ దృష్టిదోషం ఉండటం వల్ల అతను కళ్ళజోడు పెట్టుకుంటాడు లెండి) ఇంకా కావాలంటే ప్యూన్ కరిముద్దీన్‌తో సాక్ష్యంకూడా యిప్పిస్తాననీ బల్ల గుద్ది చెప్తాడు ఎల్డీసీ లోకనాథం.

ఆ సంగతి విని అంతా "ఎంత మొగుడూ పెళ్ళాలైతే మాత్రం అంత విరగబాటు పనికిరాదు" అనుకున్నారు.

ఎంత కొత్తగా పెళ్లయితే మాత్రం బయట కొచ్చినప్పుడన్నా కాస్త హద్దుల్లో ఉండొద్దూ? అనుకున్నారు వయసుమళ్ళి, నలుగురైదుగురు పిల్లలతండ్రులైన గుమాస్తాలు.

"ఇంటిదగ్గర మాకూ వున్నారు పెళ్ళాలు. కాని యిలా మొహం వాచిన ట్లుంటామా మేము?" అన్నారు అక్కసుగా ప్రసాదు వయసువారే అయిన కుర్రకారు గుమాస్తాలు.

లోపల ఎవరేమనుకున్నా ఆ నవ దంపతుల ప్రణయలీలలను ఉచిత వినోదంగా పరికించటం అలవాటైపోయింది అందరికీను. వాళ్ళిద్దరూ ఆఫీసులోకి చేరినప్పటినుండి ప్యూన్ నుండి సూప ర్నెంటు వరకు తమ పనిలో ఏకాగ్రతన్నదే పోయింది. ఆఫీసు టైములో ఫైల్సు ముందర వేసుకుని పక్కచూపులతో వారిరువురి ప్రతి కదలికనూ పరిశీలించటం, ఆ తరువాత లంచ్ టైము

లోను. ఆఫీసు మూసేసిన తరువాతను వాళ్ళ నటువోవిచ్చి వాళ్లారోజు చేసిన ఘోరమైన పనులను గురించి ఒకరి కొకరు చెప్పుకుని అలాటి పనులకు ఏకగ్రీవంగా తమ తీవ్ర నిరసననుకూడా చెప్పేవారు. తద్వారా తమ గుండెల్లో దాగిన అకారణమైన అసూయను, ఎందుకో తమకే అర్థంకాని బాధను వెళ్ల గక్కుకునేవారు.

భార్యాభర్త లిద్దరు అన్యోన్యంగా ఉంటూ, అలా వున్నట్టు పైకి కూడా కనపడితే ఎందుకో ఏ వ్యక్తీ సహించ లేడు. నిజానికి తమ వైవాహిక జీవితం సాఫీగా గడిచిపోతున్నాకూడా అలాటి ముచ్చటైన జంట తమ కళ్ళముందు కళకళలాడుతూ తిరుగుతుంటే తమ జీవితంలో ఏదో వెలితి ఉన్నట్లు భావి స్తారు ప్రతి ఒక్కరూను. ఆ జంటలోని అనురాగం ఎంత ఎక్కువగా ప్రస్ఫుట మౌతుంటే తమలోని వెలితి అంత పెద్దగా కనిపిస్తుంది.

అందుకే మాలతీ ప్రసాదులను చూస్తున్నకొద్దీ ఆ ఆఫీసులోని మిగతా గుమాస్తాల హృదయాల్లోని అసంతృప్తి యింతింతై, అంతై వృద్ధిచెందసాగింది. ఓ ప్రక్క అసంతృప్తి పెరుగుతున్నా వారి యెడల కుతూహలం కూడా మరో వంక జనించసాగింది.

ఆరోజు నిశ్శబ్దంగా ఆఫీసులోకి ప్రవేశించిన ప్రసాదు, మాలతీల ఆ తరువాతి ప్రవర్తన మరింత ఆశ్చర్యం కలిగించింది వాళ్ళకు.

తమ సీట్లదగ్గరకు వెళ్తూనే ప్రసాదు తన కుర్చీని బరబర యీ చివరకు లాక్కుని కూర్చున్నాడు. మాలతికూడా 'నేను మాత్రం తక్కువతిన్నానా'' అన్నట్లుతన కుర్చీని రెట్టింపు విసురుతో ఆ వైపుకు లాక్కుని కూర్చుంది.

వాళ్ళిద్దరూ చేసిన చప్పుడుకు ఆఫీసు లోని పరిసరమంతా గజగజలాడింది.

అక్కడివారి గుండెలన్నీ ఝల్లు మన్నాయి.

ప్రసాద్ ముఖం ధుమధుమలాడు తోంది. మాలతి ముఖం ఎఱ్ఱగా కంది పోయి ఉంది.

ప్రసాద్ ఫైళ్ళు తెరిచాడు. మాలతి టైపురైటర్ స్టార్ట్ చేసింది. ప్రసాద్ కళ్ళు ఫైళ్ళలోకి చూస్తున్నాయి. మాలతి వేళ్ళు టైప్ మిషనుమీద కదుల్తున్నాయ్; కాని యిద్దరిదృష్టీ తాముచేసే పనిమీద లేదు.

ఉద్రేకంతో యిద్దరి పెదవులూ కదుల్తున్నాయ్. ఇద్దరి చేతులూ వణుకు తున్నయ్.

ప్రసాదు మాటిమాటికీ రుమాలుతో ముఖం తుడుచుకుంటున్నాడు, మాలతి పైపంటితో కింది పెదవి కొరు క్కుంటోంది.

ప్రసాదుకళ్ళు రెండూ సూర్య గోళాల్లా భగభగా మండుతున్నయ్.

మాలతికళ్ళు ఏపాటిగాలి వీచినా వర్షించ బోయే నిండు మేఘాల్లా ఉన్నాయ్.

ఐదు నిమిషాలపాటు ఊపిరి బిగపట్టి బిక్కు బిక్కుమంటూ నడచింది గోడ గడియారం

హఠాత్తుగా ప్రసాదు "ఆస్కేలిటు తగలెయ్యి" అన్నాడు; అతని కంఠ స్వరానికి అదిరిపడ్డారుఆఫీసు జనమంతా; కాని మాలతి మాత్రం జంకలేదు. పైగా "ఉం!" అంటూ తనపక్కనే ఉన్న స్కేలునుతీసి అతనివైపుకు నిర్లక్ష్యంగా విసిరివేసింది

స్కేలందుకుంటూ ఆమె కళ్ళలోకి కొరకొర చూసేడు "ఏంటా తలబిరుసు?" అన్నట్టు.

"పోవోయ్. నువ్వలాచూస్తే నాకు భయమనుకున్నావా?" అన్నట్లు తలెగ రేసింది మాలతి.

వీళ్ళధోరణిచూసి తన కళ్ళను తానే నమ్మలేనట్లు కళ్ళజోడు నోసాకి కిందకు లాక్కొని చూసేడు సూపర్నెంటు.

లోకనాథం ముక్కుపుటాలెగ రేసేడు.

వైవాహిక జీవితంలో ఆరేళ్ళ సర్వీసున్నా ఒక మహానుభావుడు అర్థమైనట్లు తల పంకించేడు.

బ్రహ్మచారి సుబ్బారావు ఆయోమయంగా చూసేడు.


ఇంకా కుర్రతనం వదలని, నాలుగు నెల్లక్రితమే ఉద్యోగంలోకి ప్రవేశించిన శర్మ నోటికి చెయ్యడ్డం పెట్టుకుని వేళ్ళ సందుగా కిసుక్కున నవ్వేడు.

ఆ అరగంటసేపు సస్పెన్సుతో నిండి పోయింది ఆగదంతా.

అందరి బుర్రల్లోను ఎన్నో ప్రశ్నలు, ఆలోచనలు సందేహాలు మెదులుతున్నాయ్; వాటిని పైకి వెల్లడించుకోవాలనే ఆరాటం కూడా ఉంది కాని ఆసమయం అందు కనుకూలంగా లేనందున అంతా నోర్లు మూసుకుని కళ్ళతోనే ఒకరితో ఒకరు మాట్లాడుకోసాగేరు. కాని ప్రసాదు, మాలతి వాళ్ళ ఉనికినే మర్చిపోయినట్లు ప్రవర్తించసాగేరు. పెన్సిళ్ళు, కలాలు, టాగ్‌లు, ఫైళ్ళు ఒకదానికొకటి అభిముఖంగా తెలుగు పౌరాణిక చిత్రాల్లో యుద్ధం సీనులోని ఆయుధాల్లా రకరకాల కోణాల్లో ఒకరినుండి మరొకరివైపుకు దూసుకుపోతున్నాయ్. జన్మాభ్యా ఆ వస్తువులు ఉమ్మడి సొత్తవటంవల్ల పక్షపాతం లేకుండా ఎక్కడో ఒకచోట పడుండేవి కాని యిప్పుడు ఆదంపతుల మధ్యరేగిన క్రోధఝంఝామారుతం వల్ల వాటికి స్థానభ్రంశం పొందక తప్పలేదు.

కొంతసేపలా ఆ నిశ్శబ్ద యుద్ధం ముగిసేక వాగ్యుద్ధం ప్రారంభించేరు దంపతులు.

"ఏమిటి 'ధన్ ధన్'మంటూ ఒకటే చప్పుడు చేస్తావా మిషన్‌ని?" విసుక్కున్నాడు ప్రసాదు.



"అంతగా వినలేకపోతే చెవులు మూసుకోండి" విసురుగా సమాధాన మిచ్చింది మాలతి.

"ఉద్యోగంలోచేరి ఏడాదైనా యింక టైపురైటర్ని ఎలా హాండిల్ చెయ్యాలో కూడా తెలిసి చావదు."

"యూనివర్శిటీ డిగ్రీ పుచ్చుకుని, ఉద్యోగంలోచేరి నాలుగేళ్ళయినా తప్పులు లేకుండా వ్రాయటం తమరికి రాదుగా."

"చదువుకున్న భార్య విలువ చవటల కేం తెలుస్తుంది?"

"తెలివితేటలకు సంతోషించేం కాని అంతటితో నోరుమూసుకో"

"ఆపని తమరేచేస్తే సరిపోదూ?"

"ఉఁ!" గుడ్లెఱ్ఱచేసి ఆమెవంక చూసేడు ప్రసాదు. ఆమెపైన పళ్ళు పటపట కొరికాడు.

కాని మాలతి యిసుమంతైనా జంకలేదు ఓసారి కళ్ళెగరేసి ముఖం పక్కకు తిప్పేసుకుంది.

మరొక అరగంట మెల్లగా గడచింది.

ఆఫీసులో వారందరికీ నిమిషాలు యుగాలుగా గడుస్తున్నాయ్. ఎప్పుడు లంచ్ టైమవుతుందా, ఎప్పుడు బయటికి వెళ్ళి చర్చలు ప్రారంభిద్దామా అని గడియారంవంక చూస్తూ కూర్చున్నారు. ప్యూన్ కరిముద్దీన్ కాలుగాలిన పిల్లిలా అటూ యిటూ తిరుగుతున్నాడు. ఎప్పుడూ ఆ టైపింగ్ బాగాలేదనీ, యీ డ్రాఫ్టు చెత్తగా ఉందనీ, వాళ్ళ కుద్యోగాలివ్వటం పబ్లిక్‌వేస్టని అందరి

మీదా విరుచుకుపడే సూపర్నెంటుకూడా ఆ రోజెంతో ప్రశాంతంగా ఉన్నాడు. అసలేమైనా కాగితాలు చూస్తేగా తప్పులు పట్టటానికి? నలభయ్యోపడిలో పడిన సూపర్నెంటులో ఆ నవదంపతుల కలహం కుతూహలం రేపింది. అందువల్ల దొంగచాటుగా వారిద్దరినీ మార్చి మార్చి చూస్తూ కూర్చున్నాడు.

ఎలాగైతేనేం చివరికి వాళ్ళందరికీ 'రిలీఫ్' కలిగిస్తూ ఆఫీసు గడియారం రెండుగంటలు కొట్టింది.

సూపర్నెంటు ఓసారి మాలతీ ప్రసాదులవైపు చూసి బయటకు వెళ్ళిపోయేడు.

మిగతా వాళ్ళుకూడా కూడబలుక్కున్నట్లు అంతా ఒక్కసారి లేచివెళ్ళేరు. రోజూలా కాంటీన్‌కి పోకుండా ఆఫీసు బయటవున్న చెట్లనీడల్లో నిన్నటి చర్చలు ప్రారంభించేరు.

"ఇంతకూ ఏమయ్యిందంటా—వీళ్ళిద్దరికీ?"

"ఇంటిదగ్గర ఏదో జరిగిఉంటుంది."

"ఇంకా వేరే యేం జరుగుతుంది? ఇంటిదగ్గర ఉండేది వీళ్ళిద్దరేగా. ఏదో మాటా మాటావచ్చి పోట్లాడుకుని ఉంటారు.

"చూస్తుంటే మామూలు పోట్లాటలాగా లేదే. లేకపోతే రోజూ ఒక్కక్షణం అయినా విడిచిఉండనివాళ్ళు ఇలా బద్ధశత్రువుల్లా ప్రవర్తిస్తారా?"

"ఆ మాలతిచూడు, ఎంత పొగరుగా సమాధాన మిస్తోందో."

"ఆడజాతే అంత. కయ్యంలోకి దిగేరంటే దాని అంతు తేల్చేందే వదిలిపెట్టరు. ఇక ఆ ఎదురింటి పార్టీ మొగుడైతే యింక చెప్పనక్కర్లేదు. "ఒక అనుభవశాలి" వాపోయేడు.

"ఈ అకాలకలహం దేనికి దారి తీస్తుందో."

"ఏమో వాళ్ళు డైవర్సు యిచ్చుకున్నా ఆశ్చర్యపడనక్కర్లేదు. చదువుకున్న ఏ ఆడది భర్తని జీవితాంతం అంటిపెట్టుకుని ఉంటుంది?" రామారావు అన్నాడు.

అతని భార్యకి చదువురాదు; అందుచేత అతనికి చదువుకున్న ఆడవాళ్ళను చూసినా వాళ్ళను పెళ్ళిచేసుకున్న మగవాళ్ళను చూసినా అసూయ. ఇంకా చెప్పాలంటే పళ్ళమంట కూడాను.

డైవర్సు అనేమాట వినగానే గోపాలం కళ్ళు మిలమిల మెరిసినయ్. అతనికి మాలతంటే అదో రకం మోజు. పెళ్ళయిన ఆడదానిమీద అందునా ఆమె భర్త పక్కనుండగానే మోజుండటమేమనుకునేరు. గోపాలానికికూడా పెళ్ళయింది. ఇద్దరు పిల్లలుకూడాను. కాని మాలతిని చూస్తుంటే అతనికి తన భార్యలో అన్నీ లోపాలే కనిపిస్తయ్. అందానికి అందం, దానికి తగ్గ ఆకర్షణ, దానికి తగ్గట్టు చదువు, సంస్కారం

గల మాలతిముందు తనభార్య దిష్టితిప్పటానికికూడా పనికిరాదనీ ఆమెనుభార్యగా పొందిన ప్రసాదు ఎంతో అదృష్టవంతుడనీ ఆఫీసులో వారిని చూస్తూ కూర్చున్నంత సేపులో రోజుకి కనీసం పది సార్లయినా అనుకుంటాడు గోపాలం. పదహారేళ్ళప్పుడే తనకి పిల్లనికూడా చూపకుండా పదివేలకట్నం తీసుకుని తన మెడనో 'గుదిబండ'ను తగిలించిన తల్లిదండ్రులను తనివితీరా తిట్టుకుంటాడా సమయంలో.

మాలతి, ప్రసాదు పోట్లాడుకున్నారంటే వాళ్ళు విడాకులు పుచ్చుకునే అవకాశంకూడా లేకపోలేదనీ అనుకుంటే అతనికెంతో సంతోషంగా ఉంది. వాళ్ళిద్దరూ విడిపోతే తనకి ఒరిగేదేమి లేకపోయినా, ఆ పైన తను మాలతిని పెళ్ళి చేసుకునేది అంతకన్న లేకపోయినా, వాళ్ళిద్దరూ పోట్లాడుకున్నారంటేమాత్రం చాలా ఆనందంగా ఉందతనికి; కలకలలాడే దంపతులను చూస్తే వంటికికారం రాసుకున్నట్లు ఫీలవుతూ భగ్నమైన వివాహాలను చూసి అనిర్వచనీయమైన ఆనందాన్ని, తృప్తినీ పొందే రాక్షస జాతి మనుషుల్లో గోపాలంకూడా ఒకడు.

"ఈ కాలంవాళ్ళు ఏమొచ్చినా పట్టలేరు. ప్రేమఉంటే పూసుకుతిరగటం. లేకపోతే నువ్వెంతంటే నువ్వెంతనుకోవటం. అసలీ రోజుల్లో వివాహమన్న పదానికి వేల్యూయే పోతోంది." అన్నాడో అరదజనుమంది పిల్లలతండ్రి.

ఇలాగే ఎవరికితోచిన అభిప్రాయాలను వాళ్ళు కక్కేసుకుని ఆ ఖాళీకడుపులను నింపే నిమిత్తం కాంటీన్‌కి పోయేరు ఆదరాబాదరాగా.

వాళ్ళంతా తిరిగివచ్చేసరికి మాలతీ ప్రసాదులు గట్టిగా ఏదో వాదించుకుంటున్నారు. వీళ్ళను చూసేసరికి చటుక్కున వాదన నాపేసి మళ్ళీ ఎడమొగం, పెడమొగం పెట్టి కూర్చున్నారు.

"వీళ్ళిద్దరూ కాంటీన్‌కికూడా పోకుండా కలహంతోనే కడుపునింపుకున్నట్లున్నారే." అనుకున్నారంతా.

అప్పటినుండి మళ్ళీ ఆఫీసు వదిలే వరకు అంటే సాయంత్రం ఐదింటిదాకా ఇద్దరూ అలాగే ఉన్నారు. "చూస్తుంటే యిదేదో సీరియస్ కేసుగానే ఉందే" అనుకున్నారు మిగతావాళ్ళు. వాళ్ళకు ఓ పక్క కుతూహలం, మరో పక్క భయం, ఉత్సాహం అన్నీ కలిగినయ్.

సూపరెంటెండెంట్ సాబ్ కూడా ఆ రోజు ఆలోచనలో పడటంవల్ల కనీసం ఒకా నెపంతోనైనా తిట్లు తప్పినందుకు అంతా సంతోషంగా వున్నారు.

ఎలాగైతే నేం గోడ గడియారం ఐదు కొట్టింది.

అందరూ లేచారు, కాని రోజులా లేదు ఎవరూను. మనసులో ఏదో పెద్ద

పలితిగా, రేపేం జరగబోతోందో నన్న ఆదుర్దాగా వుంది. సరాసరి యింటికి పోకుండా అంతా చెట్లకింద నిలబడ్డారు. ఒకరి కొకరు గజం ఎడంగా విసవిస నడుస్తూ వెళ్తున్న మాలతీ ప్రసాదులను ఓరకంట పరిశీలిస్తూ నిల్చున్నారు.

వాళ్ళు గేటుదాటి వెళ్ళినాక అంతా ఒకరిమొహం ఒకరు చూసుకుని చిన్నగా నవ్వుకున్నారు. ఆ పైన ఆలోచనలో పడి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయేరు.

అసలేం జరిగిందంటే—

అంతకు క్రితం రాత్రి భోజనాలైనాక మాలతి వంటిల్లు సర్దుకుంటూంటే ప్రసాద్ మంచంమీద పడుకుని ఏదో నవల చదువుతున్నాడు. ఆ నవలను మాలతి అంతకుముందే చదివేసింది; ప్రసాద్ కూడా నవలలో చాలా భాగం చదివేసేడు. ఇంక యిరవై పేజీలు మాత్రమే ఉన్నాయ్. మాలతి వచ్చేలోగా ఆ కాస్తా కూడా పూర్తిచేయాలని త్వరితంగా చదువుతున్నాడు.

మాలతి వంటింటి పనైనతరువాత ముఖం కడుక్కుని పౌడరు రాసుకుని, తెల్లచీర, తలలో మల్లెలు ధరించి, వక్కపొడి తీసుకుని వయ్యారంగా వచ్చింది గదిలోకి.

వస్తూనే "ఏం చదవటం కాలేదా యింకా?" అనడిగింది అందంగా నవ్వుతూ.

"ఊఁ! కొద్దిగా ఉంది. టూ మినిట్స్ ప్లీజ్!" ఆమె వంక చూడకుండానే పుస్తకంలో లీనమైన ప్రసాదు చెయ్యి చాపేడు. మాలతి అతని చేతిలో వక్కపొడి పెట్టింది కొంచెం చిరాగ్గా.

ఇంత కష్టపడి అలంకరించుకు వస్తే తనవంక కన్నెత్తైనా చూడదే—అనుకుంది ఎప్పుడూ ముక్కుమీద కోపం ఉండే మాలతి. ఎంత పుస్తకం చదువుతుంటే మాత్రం అంత పరాకా అనుకుంది చివరికి అతను పుస్తకం పూర్తిచేసేసరికి ఐదు నిమిషాలు పట్టింది. ఆ ఐదు నిమిషాలు ఐదు యుగాలుగా గడిపేస్తూ ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చుంది—అతని పక్కనే మాలతి.

చదవగానే పుస్తకాన్ని పక్కనే వున్న బల్లమీదకు విసిరేసి తల కింద రెండుచేతులూ మడచిపెట్టుకుని ఏదో ఆలోచిస్తూ వెల్లకిలా పడుకున్నాడు ప్రసాదు. అతని ధోరణికి మరింత రెచ్చిపోయింది మాలతి.

ఎలాగో కోపాన్ని అణచుకుని అతన్ని లోకంలోకి రప్పిద్దామనే ఉద్దేశ్యంతో "ఎలా వుంది నవల?" అనడిగింది.

"బాగానే వుంది" ఇంకా ఆలోచిస్తూనే సమాధానమిచ్చేడు ప్రసాద్.

"శేఖరం, సావిత్రి పాత్రలపై మీ అభిప్రాయం యేమిటి?"

"శేఖరం పాత్రను చాలా ఉదా




త్తంగా చిత్రించేరు రచయిత సావిత్రి పాత్ర కూడా చాలా విలక్షణంగా ఉంది"

అతనింక వాక్యం పూర్తిచేయక ముందే మంచం మీదినుండి చివ్వున లేచి నిలబడింది మాలతి.

"ఏమిటి? మీకు వాళ్ళిద్దరి పాత్రలు నచ్చాయా? పక్షవాతం వచ్చిన మొగుడి కళ్ళు గప్పి, ప్రేమ అనే బురఖా తగిలించుకుని బావతో ప్రేమకలాపాలను సాగించిన సావిత్రిపాత్ర మీకు నచ్చిందా? పైకి ఆదర్శాలు వల్లిస్తూ అందరిచేత మహాపురుషుడని శ్లాఘింపబడుతూ పర స్త్రీని చీకట్లో అనుభవించటానికి వెనుదీయని శేఖరం ఉదాత్తుడా? ఛీ! మీరిలాంటి మనుషులని నేనెన్నడూ అనుకోలేదు.

"అదికాదు మాలతీ..."

"ఇంక నాకు మీరేం చెప్పనక్కర్లేదు. ఛీ! ఏం మగవాళ్ళు! కారక్టర్ లేని స్త్రీ అంటే ప్రతి మగవాడికీ ఆకర్షణే! లోలోపల యిష్టమే; మీరు మేకవన్నె పులులు మీలోనూ అలాటి నీచ భావం ఉంది. అందుకే వాళ్ళిద్దరి అక్రమ సంబంధాన్ని మీరంత సహజంగా తీసుకోగల్గుతున్నారు. ఒక మనిషికి నచ్చిన పుస్తకాలపేర్లు చెప్తే చాలు, ఆ మనిషి శీలం ఎలాటిదో చెప్పవచ్చు. ఏ మనిషైనా తన మనస్తత్వానికి తగ్గ రచనలనే మెచ్చుకుంటాడు. పర పురుషుడి భార్యను అనుభవించటంలో వున్న 'థ్రిల్' ని మీరు శేఖరం పాత్ర ద్వారా పొందుతున్నారు. అదే సంస్కార

వంతుడైన పురుషుడైతే ఆ పుస్తకం చదివిన మరుక్షణమే పొయ్యిలో పడేసి భస్మం చేస్తాడు...ఆగండి. నన్ను చెప్ప నివ్వండి. మీలో నీతి కాదు; నిగ్రహం లేదు చెడిపోయే సాహసం కూడా లేదు. అందుకే చెడిపోయిన పాత్రలు గల పుస్తకాలంటే మీ కిష్టం ఇదివరకు కూడా ఒకసారిలానే ఒక పాత్రను సమర్థించేరు. అప్పుడే తెలిసిపోయింది మీ సంస్కారం ఎలాటిదో..." ఏక ధాటిగా మాట్లాడేస్తోంది మాలతి-ప్రసాద్ నేమీ మాట్లాడనీయకుండా

చివరికి విసుగెత్తి ప్రసాదుకూడా ఆమెకు ఘాటుగానే సమాధానం యిచ్చేడు దాంతో మరింత రెచ్చిపోయింది మాలతి.

ఇక ఆతరువాత వాళ్ళు వాడిన భాషను గ్రంథస్థం చెయ్యటం ఉచితం కాదేమో-దాంపత్య జీవితానుభవం ఉన్న వాళ్ళంతా అర్థం చేసుకోగలరనే నా విశ్వాసం

సరే-ఆరోజు రాత్రి యిద్దరికీ శివరాత్రి జాగరణే అయింది మాలతి సర్రున మంచంమీదనుండి ఒకదిండు లాగి కిందపడేసింది. తల్లోని మల్లెపూల దండను తీసి విసిరవతల పడేసింది తెల్లని యిస్త్రీచీర విడిచేసి పాతచీర కట్టుకుని నేలమీద పడుకుంది - చాపైనా వేసుకోకుండా

ప్రసాదు మంచంమీద కాసేపు పొర్లేడు. తరువాత లేచి గదిలో పచార్లు చెయ్యసాగాడు. ఆ రాత్రి మూడు సిగరెట్ ప్యాకెట్లు ఖాళీ అయినయ్.

మాలతి ఉండుండి సన్నగా ఏడవటం గొణగటం, ముక్కు చీదుకోవటం లాటి పనులు చేస్తుంటే ప్రసాదు పచార్లు చేస్తున్నవాడల్లా ఆగి ఆమెనేదో అనటం ఆమె సమాధానం చెప్పటం, మళ్ళీ యిద్దరూ వాదించుకోవటం ఏడుపులు, ముక్కుచీదుళ్ళు ... యిలా గడిచిపోయింది తెల్లవారు ఝామున నాలుగు గంటల వరకూను. చివరికి అలసిపోయి విసుగెత్తి యిద్దరూ నిద్రలోకి ఒరిగేరు.

తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. అప్పుడు లేచి అన్నం, ఒక కూరమాత్రం చేసింది మాలతి రోజూ ఒకేకంచంలో తినేవాళ్ళల్లా ఆరోజు రెండు కంచాల్లో వడ్డించింది మాలతి. పంతాలకు పోయి వేర్వేరుగా తిన్నారే తప్ప యిద్దరికీ ముద్ద గొంతుదిగలేదు. ఎలాగో ఎంగిలిపడి ఆదరా బాదరా ఆఫీసుకు బయల్దేరేరు. అప్పటివరకు వాళ్ళిద్దరూ ఒకరితో ఒకరు ముఖాముఖి మాట్లాడుకోలేదు. మాట్లాడిన ఒకటీ రెండు మాటలూ కూడా గోడలు, కుర్చీలు, బల్లలు, పాత్రలకు ఉద్దేశింపబడినయ్. ఆఫీసుకు వెళ్ళిన తరువాత జరిగిన విషయాలు పాఠకులకు తెలిసినవే

ఆరోజు సాయంత్రం ఆఫీసునుండి నీరసంగా ఇల్లు చేరుకున్నారు మాలతి,

ప్రసాదు. అప్పటికి ఇద్దరూకూడా శారీర కంగా మానసికంగా అలసిపోయేరు ఇంతవరకూ నాలుగైదుసార్లిలా వాళ్ళిద్దరి మధ్య భేదాభిప్రాయాలు వచ్చేయికాని వెంటనే ఎవరోఒకరు సర్దుకోవటం వల్ల అరగంటలోనే దగ్గరగావచ్చేవాళ్ళిద్దరూ కాని యీసారి దాదాపు ఇరవై నాలుగు గంటలుగా ఒకరి కొకరు దూరంగా ఉండటం వల్లను ఉదయంనుండి ఏమీ తినకపోవటం వల్లను నీరసంతోపాటు విచారంగాకూడా ఉంది యిద్దరికీను ఇంటికి వచ్చేసరికి యిద్దరిలోనూ పోట్లాడేశక్తి తగ్గిపోయింది అందువల్ల మౌనంగా స్నానంచేసేరు. గంటలో కూర, పచ్చడి, చారు, అన్నం తయారు చేసింది మాలతి

వంటంతా అయినాక రెండు కంచా ల్లోనూ పెట్టి, "అన్నం వడ్డించేను. రావచ్చు'' అంటూ గోడతోచెప్పింది. కాని యీసారి ఉదయానలా ఆమె కంఠంలో ఆవేశంకాని, కోపంగానీ లేవు. చాలా నీరసంగా, ప్రశాంతంగా ఉందామె కంఠం ఆకలితో ఉండటంవల్ల ఇద్దరూ కూడా ఆవు రావురుమంటూ తినేసే రన్నం.

కడుపులో తిండి పడేసరికి శక్తి వచ్చింది. దాంతోపాటు పౌరుషంకూడా తలెత్తింది, మళ్ళీ మనసులో ఒకరి నొకరు నిందించుకున్నారు. ఎవరికి వాళ్ళు ఎదుటివ్యక్తిదే తప్పని గట్టిగా తీర్మానించుకుని కోపం తెచ్చుకున్నారు. కాని పైకి పోట్లాడేఓపిక, ఉత్సాహం యిద్దరిలోనూ అంతరించినయ్ అప్పటికి. క్రితం రాత్రినుండి అప్పటివరకు తమిద్దరి మధ్యా జరిగిన సంభాషణ గుర్తుకు తెచ్చుకుని ఎదుటివ్యక్తి పరుషవాక్యాలతో తమనెలా బాధించిందీ పునశ్చరణ చేసు కుని క్రోధం తెచ్చుకున్నారు.

దాంతో మళ్ళీ నిద్రపైము వచ్చేసరికి యిద్దరూకూడా బిగుసుకుపోయి ఎడ మొగం పెడమొగం పెట్టుకున్నారు. మొదట ప్రసాదు రాజీకి వస్తాడేమోనన్న ఉద్దేశ్యంతో రతీదేవిలా అలంకరించుకుని గదిలోకి ప్రవేశించింది మాలతి. కాని అతను మాట్లాడించక పోయేసరికి కింద పడుకుంది ఐనా క్రితం రాత్రిలా మల్లె దండను అవతలపారేసి, పాతచీర కట్టు కునేంత పౌరుషం యీనాడులేదు.


నిమిషాలు గడుస్తున్నాయ్. ఇద్దరికీ నిద్రపట్టటంలేదు వాళ్ళకు ఒక్కొక్క నిమిషం ఒక యుగంలా గడుస్తోంది.

మాలతి కళ్ళవెంబడి ధారలుగా కురు స్తోంది కన్నీరు. రాత్రికూడా ఆమెకు కన్నీరు వచ్చింది కాని ఆ కన్నీటిలో పౌరుషం ఉంది. ఈనాటి కన్నీటిలో దుఃఖం ఉంది తన ప్రాణేశ్వరునితోటి వియోగాన్ని సహించేశక్తి యిక తనకు లేదని గ్రహించింది మాలతి. దాంతో యీ పోట్లాట కంతటికీ కారణం తనే నేమోనన్న అనుమానం యీ ఇరవై

నాలుగు గంటలలోనూ మొదటిసారిగా జనించిందామెలో. అతనేదో ఒక పుస్తకంలోని పాత్ర నచ్చిందనగానే తనెందుకలా రోషం తెచ్చుకోవాలి? నిజానికి శేఖరం పాత్రను చాలా గొప్పగా వ్రాసేడు రచయిత. ఎంత ఉదారతగల మనిషిలోనైనా కొన్ని బలహీనతలు ఉండకపోవనే అభిప్రాయాన్ని చెప్పాలనే ఉద్దేశ్యంతో శేఖరం అతి తీవ్రమైన నరాల కంపనానికి లొంగిపోయినట్లు చూపుతాడు రచయిత. ఐనప్పటికీ మిగతా విషయాల్లో అతను సాధారణ మానవులందరికన్న అతీతుడు. అందుకే ప్రసాద్‌కి ఆ పాత్ర నచ్చిఉండవచ్చు. అంతమాత్రాన తనింత రాద్ధాంతం చేయటం సబబుగా లేదేమో. పోనీ ఏదో ఆవేశంలో తను నోరుజారిందే అనుకో. అంత మాత్రాన అతనుకూడా వివేకాన్ని కోల్పోయి యిలాంటి నరకాన్ని సృష్టించటం తగునా? భార్యాభర్తల్లో ఎవరి నోరుజారినా రెండోవ్యక్తి సహనాన్ని ప్రదర్శించటం కనీసధర్మం. భార్యే అన్నివిధాలా అణగిమణగి ఉండాలని, భర్త ఇష్టం వచ్చినట్లు మాట్లాడవచ్చుననీ అంటే తనకు వళ్ళు మండుతుంది. గృహశాంతికి స్త్రీ ఎంత బాధ్యురాలో పురుషుడుకూడా అంతే బాధ్యుడు.

అలాంటప్పుడు తన తప్పును క్షమించటం ప్రసాద్ కర్తవ్యంకాదా? పోనీ తనే క్షమాపణ వేడుకుంటే సరిపోదూ? ఊహూఁ. తన నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిన యీ 'అహం' అందు కొప్పుకోవటం లేదే ఏం చెయ్యాలి? ఒక్కసారి... కనీసం అతను గనక పలకరిస్తే చాలు. తను క్షమాపణ వేడుకుంటుంది ఇంకేం చెయ్యమన్నా చేస్తుంది. అలా సాగుతున్నాయ్—ఆమె ఆలోచనలు

ప్రసాద్‌కికూడా కాలం గడుస్తున్న కొలదీ మనసులో దిగులు గూడుకట్టుకోసాగింది. మాలతిని తనుకంటికిరెప్పలా చూసుకుంటాడే హృదయంలో పెట్టుకుని పూజిస్తున్నాడు. ఇంతవరకు ఆమె కోరినదేదీ కాదనలేదు తను. ఐనప్పటికీ ఆమె తననెందుకలా అపార్థం చేసుకుంటుంది? ఆమె తనని గూర్చి ఎందుకంత నీచంగా మాట్లాడాలి? పోనీ ఒకవేళ మాట్లాడిందే అనుకో తను మాత్రం ఆమె మాటలను అంత సీరియస్‌గా ఎందుకు తీసుకోవాలి? ఆమె స్వభావం తనకు తెలియకపోతేగా. తాటాకుమంటలా జివ్వున లేస్తుందామె కోపం ఆమెఅలా సమయం సందర్భం లేకుండా మాట్లాడుతుంటే తనైనా పట్టించుకోకుండా ఉండాల్సింది. ఐనా తనుమాత్రం తప్పుగా ఏం మాట్లాడేడు? కయ్యానికి కాలుదువ్వింది ఆమేగదా. కాబట్టి క్షమాపణ వేడుకోవటం కూడా ఆమెవంతే ఒక్కసారి 'క్షమించండి' అని ఆమె అంటే చాలు... తనామెనింక గుండెల్లో దాచుకోడూ? ఆడదానికి



తప్పుచేసినదానికి. ఆమెకే అంత పౌరుషం ఉంటే తనకెంత ఉండాలి?

అలా రకరకాలుగా ఆలోచించుకుంటూ పక్కమీద అసహనంగా దొర్లేడు ప్రసాదు.

మరోగంట గడచింది.

క్రమంగా ఇద్దరిలోనూ బిగువు సడల సాగింది. ఇంక ఎంతకాలమిలా ఉండటం? ఎవరో ఒకరు ముందు పలకరించకపోతే ఎలా? ప్రాణంకన్న మిన్నగా ప్రేమించే వ్యక్తితో విరోధం వస్తే, ఆ మనిషితో ఒకరోజల్లా మాట్లాడకపోతే — అంతకన్న నరకం వేరే ఉంటుందా? అనుకున్నారిద్దరూ.

ఒకరినొకరిలా దూరంగా ఉండేసరికి యిద్దరికీనూ ప్రపంచమంతా శూన్యమైపోయినట్లు తోచింది. ఆ శూన్యాన్ని భరించేశక్తి తమకిద్దరికీ లేదనుకున్నారు.

ఎవరికివారు అహాన్ని చంపుకుని ఎదుటివ్యక్తిని మాట్లాడిద్దామనుకున్నారు; కాని యిద్దరూ అలా చేయలేకపోయేరు. ఏదో ఒక రకమైన నిర్లిప్తత నిస్సహాయత ఆవరించినయ్ యిద్దరినీ.

మరో యిరవై నిమిషాలలా బరువుగా కదిలినయ్.

మాలతికి తనకు తెలియకుండానే మగతిగా నిద్ర పట్టేసింది. ఎంత సేపలా పడుకున్నదో తనకే తెలియదు. మళ్ళీ మెలకువ వచ్చేసరికి తను ప్రసాద్ కౌగిలిలో ఉంది. తన బుగ్గలమీదగల కన్నీటి చారికలనుబట్టి తను నిద్రలోనే ఏడుస్తోందని గ్రహించింది మాలతి.

ఇరవైనాలుగు గంటల వియోగానంతరం తను భర్త కౌగిలిలో ఉన్నానన్న భావం రాగానే ఆమెశరీరం మనసుకూడా పులకరించి పోయినయ్. సూర్యరశ్మితో కరిగిపోయే మంచులా, వెచ్చని ప్రియుని స్పర్శతో ఆమె నావరించిన కోపం పట్టుదల మొండితనం అన్నీ ఒక్కసారిగా సడలిపోయినయ్. "నన్ను క్షమించండి..." ఆమె హృదయం ఘోషిస్తోంది. కాని భావోద్రేకంతో కంఠం విడివడలేదు. ఆమె కళ్ళనిండుగా నీళ్ళు తిరిగినయ్ ఆమె పెదవులు కంపిస్తున్నయ్.

"నిద్రలోకూడా ఏడుస్తున్నావా పిచ్చి మాలతీ? నేను చాలా కఠినుడివి నీ మనసెంతో కష్టపెట్టేను కదూ?" ఆమెను పొదవి పట్టుకుని మంచంమీద పడుకోబెడుతూ అన్నాడు ప్రసాద్.

మాలతికి మాటలే కరవైనయ్. సంతోషాతిశయంతో కృతజ్ఞతతో ఆమె కంఠం పూడుకుపోతోంది. ఏం మాట్లాడకుండా తనమీద వాలిన ప్రసాద్ మెడ చుట్టూ చేతులువేసి మరింత దగ్గరగా లాక్కుంది– యిక ఏమాత్రం దూరాన్ని భరించలేనట్లు. మరుక్షణమే అతని కనుద్వయంలో. అతని పెదవులలో. అతని గుండెల్లో అతని శరీరంలోవి అణువణువులోనూ లీనమైపోయింది మాలతి.

* * *

మర్నాడు ఉదయం కూడా ఆఫీసు గడియారం పదిగంటలు కొట్టింది. క్రితం రోజులానే అందరి కళ్ళూ, చెవులూ ద్వారంవైపునే కేంద్రీకరింపబడి ఉన్నయ్—మాలతీ ప్రసాదుల ఆగమనం కోసం ఎదురుచూస్తూ.

గడియారం పదోగంట కొట్టిన పది సెకన్లకు మాలతి ఒంటరిగా గదిలోకి అడుగుపెట్టింది. ఆమె ముఖం నిర్వికారంగా ఉంది. భావశూన్యంగా వున్నా ఆమె ముఖానికి ఏ మర్థం చెప్పుకోవాలో ఎవరికీ తెలియలేదు.

ఆమె వస్తూనే ముందు సూపర్నెంటు చేతికి ఒక కాగితం ఇచ్చి వెళ్ళి తన సీట్లో కూర్చుంది. మరో పది నిమిషాలకల్లా ఆ కాగితం ప్రసాద్ ఒకగంట లేట్ పర్మిషన్ కోసం పెట్టిన అప్లికేషన్ అని అందరికీ తెలిసిపోయింది. దాంతో మరల చర్చలు ప్రారంభమైనయ్. ఎన్నడూలేనిది ప్రసాద్ యీ రోజు ఎందు కాలస్యంగా వస్తున్నట్లు? చూస్తుంటే యిదేదో 'మిస్టరీ' లాగ ఉందే" అనుకున్నారు. ప్రసాద్ ఎప్పుడు




వస్తాడా అని వాళ్ళంతా ఆదుర్దాగా ఎదురు చూడటంవల్ల ఆ ఒక్కగంట ఒక యుగంలా గడిచింది. అతను వచ్చేక వాళ్ళిద్దరి ప్రవర్తననుబట్టి తాడోపేడో తేల్చుకోవచ్చు ననుకున్నారు.

చివరి కెలాగైతేనేం అతి ప్రయాస మీద ఆ గంటా గడచింది

గోడగడియారం పదకొండు గంటలు కొట్టగానే వచ్చేడు ప్రసాద్ చెమటలు కక్కుకుంటూ. వస్తూనే రోజూలా సూపర్నెంటుకో నమస్కారబాణం పడేయటం మరచిపోయి. అది అసలు ఆఫీసన్న సంగతే జ్ఞప్తిలేనట్లు. మాలతి దగ్గరకు పరుగు పెట్టుకుంటూ వెళ్ళేడు ప్రసాద్. ఆమె కెదురుగావున్న బల్లమీద కూర్చుని. యించుమించుగా ఆమె మీద వాలిపోతున్నంతగా జరిగి — "పిక్చర్‌కి రెండు టిక్కెట్లు రిజర్వుచేసేను మాలతీ!

అబ్బబ్బ ఏం రష్షు, ఏం రష్షు! ఇవాళే రిలీజయింది కదూ? ఫస్టుషోకి టిక్కెట్లు దొరకటం చాలా కష్టమైపోయింది. ఐనా నువ్వు చూడాలని మనసు పడ్డావని చచ్చీచెడీ ఎండలో నుంచుని ఎలా గైతేనేం సంపాదించేను టిక్కెట్లు;" పసి పాపలా స్వచ్ఛంగా నవ్వేడు ప్రసాద్.

మాలతి అతనివంకే తదేకంగా చూస్తోంది అమె కళ్ళలో ప్రేమ, అరాధన, కృతజ్ఞత, గర్వం, అనిర్వచ నీయమైన మరెన్నో భావాలు నిండి ఉన్నయ్. ఆమెచూపులకు సమాధానంగా అతనుకూడా కొద్దిగా కళ్ళు చికిలించి ఆమె సర్వస్వాన్నీ తనలో యిముడ్చు కుంటున్నట్లు చూసేడు ప్రసాద్.

వాళ్ళిద్దరూ అలా ప్రపంచాన్నే మర్చిపోయినట్లు ఒకరి కళ్ళలోకి ఒకరు చూసుకుంటూ కూర్చునేసరికి, అందరినీ క్రిందటి రోజునుండి పీడిస్తున్న ఉష్ణో హాలం అనుమానం పటాపంచలై పోయినయ్. మరుక్షణమే మామూలుగా అసూయ, అసంతృప్తులతో నిండి పోయినయ్ వారి మనసులు.

"అదేంటండీ వెంకట్రావుగారూ? నిన్న అంతగా దెబ్బలాడుకుని యివ్వాళ యిలా ఒకళ్ళ కళ్ళలోనికి ఒకళ్లు చూసు కుంటూ కూర్చున్నారే?" అమాయ కంగా అడిగేడు బ్రహ్మచారి సుబ్బారావు.

"అదంతా అంతేలేవోయ్. దాన్ని దెబ్బలాట అనకూడదు. ప్రణయకల హం అంటార్లే అది;" కొత్తగా పెళ్ళై యిన వెంకట్రావ్ కులుకుతూ సమాధాన మిచ్చేడు.

"అదేం ప్రణయకలహమండోయ్. నిన్న చూసేరా మాలతి ప్రసాద్‌నెలా తీసిపారేసిందో. నాభార్యే అలా చేస్తేనా, చెమ్డా వల్చి పారేసేవాణ్ని." మగ తనంగా అన్నాడు సుబ్బారావు.

"పెళ్ళి కాకముందు నీకంతె పౌరు షంగా ఉండేవాడినోయ్ సుబ్బారావూ! ఇలాటి పోట్లాటలను స్పోర్టివ్‌గా తీసు కోవటంలోనే ఉందోయ్ రసికత్వం. సాక్షాత్తూ భగవత్స్వరూపుడైన ఆ శ్రీ కృష్ణుడికికూడా ప్రణయకలహంనెపంతో భామా పాదతాడన ప్రాప్తి తప్పలేదు. ఐనా బ్రహ్మచారివి, అందులోని సరసం నీకేం తెలుస్తుందిలేవో," అన్నాడు.

దాంతో సుబ్బారావుకు తల తీసేసి నంత పనయింది. పెళ్ళి కాకపోవటం ఒక డిస్క్వాలిఫికేషన్ అనీ, ఇప్పటికే బ్రహ్మచర్యంవల్ల జీవిత మాధుర్యం లోని చాలాభాగం కోల్పోయేననీ భావించా డా సమయంలో; 'ఏమైనా సరే పెళ్ళి చేసుకు తీరాలి. ఇక ఏ మాత్రం ఆలస్యం చెయ్యకూడదు. ఈ రాత్రికే మామయ్య కూతురు సంగతి సెటిల్ చేసుకోమనినాన్నకు ఉత్తరం వ్రాయాలి,' అని గట్టిగా తీర్మానించుకున్నాడు బ్రహ్మ చారి సుబ్బారావు.